

# రెప్పల మీద నీడలు

## – అత్తలూరి విజయలక్ష్మి



### (గత సంచిక తరువాయి)

8

“పవిత్రా! “

“చెప్పండి”

“ఎలా ఉంది నీకు? ఏమన్నాకావాలా?”

“ఊ...”

“పవిత్రా! ఏమైంది? కళ్ళు తెరువు...”

“ఊహు...”

‘ “పవిత్రా! లే, నేను శివను... లే ఏదన్నా తిని మందేసుకుందువుగాని... లే”

మృదువుగా ఆమె చేయి పట్టుకుని కదుపుతూ పిలిచాడు ఆయన.

ఉలిక్కిపడి కళ్ళు తెరిచింది పవిత్ర. తన మీదకి ఒంగి ఆదుర్దాగా చూస్తున్నాడు భర్త. పవిత్ర అయోమయంగా చూసింది.

“ఏ... ఏమైంది?”

“నేనూ అదే అడుగుతున్నాను. ఏదో కలవరిస్తున్నావు... పీడకల వచ్చిందా?”

ఆమె ఉలిక్కిపడింది. “అవును... ఏదో పీడకల... నన్ను వదలకుండా పీడిస్తున్న కల” అంది.

“మర్చిపో. అనారోగ్యంగా ఉన్నప్పుడు అలాగే ఉంటుంది. కళ్ళు మూతలు పడుతూనే ఏవో కలలు పీడిస్తాయి. లేస్తావా? ఇడ్లీ తింటావా?”

“ఆకలిలేదు” లోతు నుంచి వినిపించినట్టు వినిపించింది స్వరం.

“ఆకలి లేకపోయినా తినాలి. మందులు వేసుకోవాలిగా... లే” ఆమె మెడ కింద ఒకచేయి, గుండెల మీద ఒక చేయి వేసి లేపుతూ అన్నాడు.

ఆమె లేవబోయి తూలిపడుతూ అంది. "నా వల్ల కాదు నీరసంగా ఉంది"

"సరే, ఇలా తలగడకి ఆనుకుని కూర్చో. నేను ఇడ్లీ తెస్తాను. జాగ్రత్త. పడుకోకు." అతను ఆమె రెండు భుజాలు పట్టుకుని, దేవుడి పాదాల మీద శ్రద్ధగా సమర్పిస్తున్న పూవులా అత్యంత సుకుమారంగా తలగడ మీద ఆమె తల ఆనించి జాగ్రత్తగా పడుకోబెట్టాడు. "నిద్రపోకు" మరోసారి హెచ్చరించి, వంటగది వైపు వెళ్ళిపోయాడు.

ఆమె అతను వెళ్ళిన వైపు చూస్తూ ఉండిపోయింది.

కలవరించానా? ఏమని కలవరించి ఉంటాను? నాకప్పుడు ఏం కల వచ్చిఉంటుంది! కల గుర్తుచేసుకోడానికి ప్రయత్నిస్తూ అనుకుంది. ఎవరిని కలవరించాను? మోహన్ నా? మోహన్...

అవును అతన్నే కలవరించి ఉంటాను. ప్రతి క్షణం అతనే మెదులుతున్నాడు తన ఆలోచనల్లో. ఆయన విన్నారా? మోహన్ ని కలవరించినట్టు తెలిసిందా? ఒక్క క్షణం గుండె దడ,దడలాడింది. వెంటనే ఒక నిర్వేదం ఆవరించింది.

ఇప్పుడు వింటే మాత్రం ఏం జరుగుతుంది? తను మరణశయ్య మీద ఉంది. ఇంక జరగడానికి ఏముంది? నూరేళ్ళ జీవితం ముగిసిపోతుంది మరికొన్ని రోజుల్లో. ఇంకా ఆయనకి భయపడుతూ, ఈ జీవితం అనే అంపశయ్య మీద ఎంతకాలం పడుకోగలదు! ఇన్నేళ్ళు గుండెలో సుడులు తిరిగే భావాల గొంతు నొక్కుతూ జీవించినందుకు ఏం లబించింది? అనుమానాలు, అవమానాలు, కన్నీళ్లు, ఆవేదనలు. ఏరోజు కారోజు ఎగసిపడుతున్న ఆవేదనాగ్నికణాలు లోలోపల రాచుకుని, రాచుకుని ఈ జీవితాన్ని దహించివేసాయి. ఇప్పుడు, ఎండుపుల్లలతో, పిడకలతో, పనికిరాని చెక్క వస్తువులతో  దహనం చేయడానికి సిద్ధం చేసిన ఓ నిర్జీవమైన రూపంలా మంచంలో పడి ఉంది. ఇంకా ఎక్కడో జీవాత్మ సుడిగాలిలో ఊగుతున్న దీపంలా కొట్టు మిట్టాడుతోంది.  ఈ దీపం ఆరిపోయే లోపల ఒక్కసారి, ఒక్కసారి...

"నిద్రపోవద్దని చెప్పానా?" గబుక్కున కళ్ళు తెరిచింది.

స్టీల్ ప్లేట్ లో నిండు చంద్రుడి మీద వాలిన నక్షత్రాల్లా కారప్పొడి చల్లిన ఇడ్లీ, పరచుకున్న వెన్నెల కాంతిలా కొబ్బరిపచ్చడి.

"మధు వచ్చిందా?" అతని మొహంలోకి చూసింది.

"లేదు" స్టూల్ మంచం దగ్గరగా జరిపి, తను మంచం అంచు మీద కూర్చుని, ఇడ్లీ తుంచి ఆమె నోటికి అందించాడు.

"మిమ్మల్ని చాలా ఇబ్బంది పెడుతున్నాను కదూ!ఎంత సేవ చేయించుకుంటున్నాను!"

ఆయన నవ్వాడు "నాకు నువ్వు ముప్పై ఏళ్ల నుంచి చేస్తూనే ఉన్నావుగా."

"అది నా కర్తవ్యం"

"ఇది నా కర్తవ్యం"

ఆమె విస్మయంగా చూసింది. ఇతనేనా ఇంతకాలం తనతో కలిసి జీవించిన భర్త,.. కాపురం చేసిన భర్త. ఎలా వచ్చింది ఈ మార్పు?

"ఆశ్చర్యంగా ఉందా?"

ఆమె అడ్డంగా తలాడించింది.

"నాకు తెలుసు నీకు ఆశ్చర్యంగానే ఉంటుంది... నీకు తెలుసుగా నేను నిన్ను ఎంత ప్రేమించానో."

అతని మొహంలోకి రెప్పవేయకుండా, నోట్లో ఉన్న ఇడ్లీ ముక్క మింగకుండా ప్రాన్పడి చూడసాగింది.

"నమ్మడం లేదు కదూ?"

ఆమె అలాగే చూస్తూ ఉండిపోయింది. అతను కొన్ని క్షణాలు ఆమె సమాధానం కోసం చూసి తిరిగి అన్నాడు "నాకు తెలుసు నువ్వు నమ్మవు."

గుండె లోతుల్లో ఏళ్ల తరబడీ దాచిన బడబాగ్ని నెమ్మదిగా కనురెప్పలను దాటుకుంటూ, కనుగుడ్ల మీదకి పాకుతూ, రవ్వలు చిమ్ముతుంటే, ఆ వెలుగులో అతని మొహంలో భావాల కోసం చూసింది.

కళ్ళు వాల్చుకుని శ్రద్ధగా ఇడ్లీ వైపు చూస్తున్నాడు. తనకి ఇన్నేళ్ళుగా అర్థంకాని కొన్ని వందల ప్రశ్నలకు జవాబు అన్వేషిస్తున్న ఆమె కళ్ళల్లో క్రమంగా ఒక పలచని నవ్వు రెపరెపలాడుతూ కదిలి, మొహం అంతా పరచుకుంది. పెదవులు విడివడకుండా సన్నటి శబ్దం చేస్తూ నవ్వింది. ఆ నవ్వులో నమ్మకం తప్ప అన్ని భావాలు కనిపించాయి అతనికి.

"నమ్మడం లేదు కదూ"

అదే నవ్వుతో తల ఊపింది అస్పష్టంగా.

అతను నిశ్శబ్దంగా ఇడ్లీ మరో ముక్క తుంచి ఆమె నోటికి అందించాడు.

"చాలు తినలేను." కుడి అరచేయి అడ్డుపెట్టింది.

"ఇంకొక్కటి తిను. త్వరలో నువ్వు ఎప్పటిలా తిరగాలి"

"హు" మనసులోనే విరక్తిగా నవ్వుకుంది. ఎప్పటిలా అంటే ఎలా? వివాహానికి పూర్వమా? వివాహానంతరమా? ఎప్పటిలా?

గలగలపారే సెలయేరు ఎండిపోయింది. ఏ ఆనందపుటలలు ఈ సెలయేటిని తిరిగి నీటి గలగలలతో నింపగలవు? ఏ ఉత్సాహపు పరవళ్ళు పరవశింపచేయగలవు? అయిపోయింది. ఆయనలోని ఈ ఆలోచన, ఈ కోరిక ఆనాడే ఉండి ఉంటే తన జీవితం ఇలా అయేదా?

వివాహిత అయిన స్త్రీ పరాయి పురుషుడిని పదే, పదే తలచుకుంటూ, జీవితం చేజారిపోయిందే అని దుఃఖపడుతూ ఉంటే ఆ నేరం ఎవరిది?

కట్టుకున్న వాడు కంటిరెప్పలా చూసుకుంటే ఆ రెప్పల మీద మరో నీడ పడుతుందా?

"తీసేయనా? ఇంక తినవా?" ఆ గొంతులో అణచుకున్న అసహనం వినిపించి అతని మొహంలోకి చూసింది. దవడలు బిగుసుకుని, కోపమో, చిరాకో అణచుకుంటున్నట్టు అభావంగా ఉన్న ఆ మొహం రాయిలా ఉంది.

ఇదే మొహం ముప్పై ఏళ్ల క్రితం ఎంత అందంగా, త్రుళ్ళిపడే చిలిపిదనంతో, అల్లరినవ్వు చిందులేస్తూ ఉండేది! ఆ చిలిపిదనం, ఆ చలాకీతనం ఆ వాక్చాతుర్యం తనని మోహంలో ముంచెత్తేసాయి. ఉత్సాహం పరవళ్ళు తొక్కింది. ఎంత ప్రేమ! ఎంత మోహం? ఆ ప్రేమకోసమే చదువు అటక ఎక్కించింది...ఆ మోహం నదీ ప్రవాహంలా ముంచేత్తేస్తుంటే తనలో అహం అంతకన్నా ఎక్కువగా ఎగిసిపడింది. ఆ అహంతోటే రాక్షసంగా మోహన్ ని అవమానించింది... అందుకు శిక్ష జీవితకాలం అనుభవించింది. ఇంకా అనుభవిస్తూనే ఉంది.

సన్నగా ఏదో కిందపడిన శబ్దం ... ఉలిక్కిపడి ఆలోచనల నుంచి తేరుకుంది.

అతను ఒంగి కిందపడిన స్పూన్ తీసాడు.

చేతిలో ప్లేట్, పచ్చడి బౌల్ తీసుకుని స్టూల్ మీద నుంచి లేచి, వెనక్కి తిరిగిన అతని వీపుని గుచ్చుకుంది బాణంలాంటి ప్రశ్న."ఫోన్ చేసారా?"

అతను నిటారుగా అయ్యాడు. కొన్నిక్షణాలు సమాధానం చెప్పలేదు. నెమ్మదిగా వినిపించీ, వినిపించనట్టు అన్నాడు "చేసాను అని చెప్తూనే ఉన్నాగా రోజూ"

"అవును. చెప్తున్నారు కానీ, ఒక్కరోజు కూడా అతనిచ్చిన సమాధానం ఏమిటో చెప్పలేదు."

"అతను సమాధానం ఇవ్వలేదు"

అబద్ధం గట్టిగా అరవాలనుకుంది. శబ్దం బయటకి రాకుండా గొంతు నొక్కేసింది. దీర్ఘంగా నిశ్వసించి, కుడిచేయి వెనక్కి ఎత్తి తలగడ జరుపుకుని వెనక్కి వాలి కళ్ళు మూసుకుంది.

అతని అడుగుల శబ్దం దూరం అయి, ఆగిపోయింది. గది మొత్తం నిశ్శబ్దం అనే కొండచిలువ ఆక్రమించినట్టు ఉంది.

ఈ నిశ్శబ్దం నుంచి విముక్తి ఎప్పుడు? ఆమెని ఆమె ప్రశ్నించుకుంది.

"నీకో సంగతి తెలుసా?"

చెవిలో గుస,గుసగా వినిపించింది.

నిండుగా పూచిన పూలకొమ్మ అయింది తనువు. "ఏమిటి? సిగ్గు బరువుతో రెప్పలు వాలిపోతుంటే బలవంతంగా అతని కళ్ళల్లోకి చూసింది.

"నిన్ను చూసిన క్షణం నుంచీ నేనసలు నిద్రపోడం లేదు..."

ఓ పెద్ద అల చెంపలను తడిమి వెళ్ళిపోయింది. ఒంటి నిండా ప్రేమజల్లులే. మబ్బులను చీల్చుకుంటూ పైపైకి వస్తున్న చందమామలా ఆమె గుండె తలుపులు తెరుచుకుంటూ పెదవుల మీదకి పాకుతోంది అల్లరినవ్వు. పెదాలు బిగించి నవ్వు ఆపుకుంటూ అడిగింది "ఎందుకో".

అతను మరింత దగ్గరకు జరిగాడు. ఆ ఊపిరి సెగ ఆమెని శీతాకాలపు ఎండలా తాకుతోంది.

" ఎందుకంటే, ఆ రోజు నుంచీ, ప్రతిరాత్రీ జాగారమే అవుతోంది ఇంక నిద్రెక్కడ? అదేమిటో ఆరోజు నుంచీ నా తోటలో పూయని చెట్లు కూడా పుష్పించడం మొదలు పెట్టాయి… ప్రేమ పరిమళం ఇల్లంతా వ్యాపించి నాలో కోరికల సెగలు రేపుతోంది. పవిత్రా! ఇంక నీకు దూరంగా ఉండడం నా వల్ల కాదు." గబుక్కున కంపిస్తున్న ఆమె చేయి తన చేతిలోకి తీసుకున్నాడు. అరచేతులను తడిపిన చిరుచెమటని పెదవులతో తుడుస్తూ అన్నాడు" నిన్ను ప్రేమిస్తున్నా...పిచ్చిగా" … ఆ మాటలు అతని పెదవులు కాక గుండె పలికినట్టు ధ్వనించింది.

కంపిస్తున్న అధరాలు, అదుపుతప్పిన మనసు…చిగురాకులా వణికిపోతూ, అప్రయత్నంగా అతని భుజాల మీద వాలిపోయింది. అతని రెండు చేతులూ ఆమెని చుట్టేసి, బంధించాయి.

కాలం స్తంభించిపోయింది… అస్తమిస్తున్న సూర్యబింబం ఆకాశంలో సప్తవర్ణాలు వెదజల్లింది. గాలి అలలు అలలుగా వ్యాపిస్తూ ఆ రెండు హృదయాలను రాగరంజితం చేసింది.

ఆమె గొణుగుతున్నట్టు అంది. "నేనూ మిమ్మల్ని ప్రేమిస్తున్నా".

మరింతగా బంధిస్తూ "నిజమా?" అపనమ్మకంగా చూసాడు. నవ్వింది.

"ఈ నవ్వే నన్ను కాల్చి మసిచేసింది. ఆరోజు నుంచీ నేను నేనుగా లేను… పగలూ, రేయి విరహతాపంతో దహించుకుపోతున్నాను తెలుసా? ప్రతిక్షణం నా మదిలో నీ తలంపే… రాత్రి అయితే చాలు ఏదో దిగులు…నీకూ, నాకూ మధ్య ఉన్నది కొన్ని ఫర్లాంగులే, కానీ నేనీ దూరాన్ని అందుకోగలనా లేదా అని దిగులు. ఒక్కోసారి అప్పటికప్పుడు పరిగెత్తుకుంటూ వచ్చేయాలి అనుకునేవాడిని. కానీ, ఎన్ని అడ్డంకులు! అవన్నీ దాటుకుంటూ రాగలనో లేదో అని తలచుకుంటే నా కళ్ళు చెమ్మగిల్లేవి. ఏదో చిన్న ఆశ నన్ను బతికిస్తోంది తెలుసా?"

ఆమె మృదువైన హస్తం అతని పెదవులను తాకింది. "అలా మాట్లాడకండి… నాకు భయం వేస్తుంది" అంది.

"భయం దేనికి? నువ్వు జీవితాంతం ఇలా ఉంటే నన్నే శక్తి ఏమి చేయదు… మరి ఉంటావా?"

ఆమె చప్పున అతని నుంచి విడివడి బెదురుగా చూసింది.

"ఏయ్ ఎందుకలా చూస్తున్నావు? ఏంటి నీ సందేహం?" లాలనగా అడిగాడు.

"మీరు, మీరు నన్ను నిజంగా కోరుకుంటున్నారా?"

“ఎంతమాట అడిగావు! నా హృదయంలోనే ఉన్నావుగా నువ్వే అడుగు నా హృదయాన్ని” ఆమె వదనం హృదయానికి ఆన్చుకున్నాడు.

హృదయ కమలం వికసించింది “అడిగాను” అంది అల్లరిగా.

“అవునా? ఏమంటోంది?”

“అతను చెప్పేది నిజం అంటోంది.”

“హమ్మయ్య...ఇప్పుడు పూర్తిగా నమ్ముతావుగా”

“నమ్ముతాను... కానీ, కానీ నాన్న, అమ్మ ఏమంటారో”

“మీ బామ్మకి నేనంటే చాలా ఇష్టం తెలుసా?”

“అవును. మీరు నానమ్మ దేవుడు”

“కాబట్టి దిగులు లేదు. అటు నుంచి నరుక్కొస్తా”

ఫక్కున నవ్వింది.

“అబ్బ ఎన్ని విరజాజులు విరిశాయో! ఎన్ని పారిజాతాలు నేల రాలాయో”

“మీరు కవా?”

“నిన్ను చూసాకే అయ్యాను.” ఆమె చేయి పట్టి దగ్గరకు లాక్కోబోతుంటే దూరం జరుగుతూ అంది.

“నేను వెళ్ళాలి. నానమ్మ కంగారు పడుతుంది. ఇప్పటికే బాగా ఆలస్యం అయింది.”

“వెళ్ళిపోతావా?” దిగులుగా అడిగాడు.

“వెళ్లక ఇక్కడే ఉండిపోనా?” అల్లరిగా నవ్వింది.

“ఉండమనేగా అర్థిస్తున్నాను.”

“మెడలో పడాల్సింది పడ్డాక మీరు వెళ్ళమన్నా వెళ్ళను సరేనా? ఇప్పుడు మాత్రం వెళ్లక తప్పదు. నేను వెళ్తున్నాను.” గబుక్కున లేచింది.

“ఉండు డ్రాప్ చేస్తాను. ఒక్కదానివీ వెళ్తావా?”

“నాకేం భయం? మా ఇల్లు మహా అంటే ఐదు ఫర్లాంగులు ఉంటుంది. ఈ గుడివాడ మాది.” ధీమాగా అంది.

“అవునవును... నేను బస్సు దిగగానే ఎవరో చెప్పారులే గుడివాడలో పవిత్ర అనే దివిశన పూవు ఉంది అని, అందుకే వెతుక్కుంటూ వచ్చాను మీ ఇంటికి.” తానూ లేచి ఆమె బుగ్గ మీద చిటిక వేస్తూ అన్నాడు.

“ఓ అలాగా! అయితే మా నానమ్మని పెరట్లో పడేసి, డాక్టర్ గా ప్రవేశించారనమాట” కొంటెగా అంది.

“నానమ్మని పడేయలేదు కానీ, పడిపోయిన  నానమ్మని నడుం విరిగింది, బెడ్ రెస్ట్ అవసరం, డాక్టర్ పర్యవేక్షణ మరీ అవసరం అని చెప్పి, ఉన్న దానికన్నా ఎక్కువ భయపెట్టి, ఆ వంకతో మీ ఇంటికి పదే, పదే వస్తూ నిన్ను మాత్రం పడేశాను... ఎక్కడో తెలుసా? ఇక్కడ.” ఆమె చేయి పట్టుకుని లాగి గుండెలకు హత్తుకుంటూ అన్నాడు.

గబుక్కున వెనక్కి జరిగి, కళ్ళు పెద్దవి చేసి “అమ్మో నానమ్మని అనవసరంగా భయపెట్టారా? ఉండండి... మీ పని చెప్తాను.” తర్జనితో బెదిరిస్తూ అంది.

“ఏం చేస్తావేంటి ఇంతకన్నా” మరోసారి దగ్గరకు లాక్కున్నాడు.

“చాలు, చాలు పదండి... ఈపాటికి నాన్న నన్ను వెతుక్కుంటూ బయలుదేరి ఉంటారు.” గోముగా అంది.

“ మీ నానమ్మతో కలిసి సినిమాలు తెగ చూస్తూ ఉంటావు కదా... నీకసలు సరసం తెలియదు కదూ”

“మీరు నేర్పిద్దురుగానిలే”

“చూడడానికి ముద్దమందారంలా ముగ్ధమనోహరంగా ఉండే నీలో ఎంత అల్లరి ఉంది.”

“అప్పుడే ఏం చూసారు?” చూపుల విరిబాణాలు వేస్తూ బయటకు నడిచింది.”

వాళ్ళిద్దరినీ చూసిన వాచ్ మాన్  వినయంగా దగ్గరకు వచ్చాడు.

“ఇవాళ క్లినిక్ తెరవడం లేదు. నువ్వు వెళ్ళిపో” అని అతనికి చెప్పి కారు వైపు నడిచాడు డాక్టర్ శివరామకృష్ణ. పవిత్ర అనుసరించింది.

ఆరోజు పడిన బీజం మొలకెత్తి, చివుళ్ళు తొడిగి పుష్పించడానికి ఎక్కువ రోజులు పట్టలేదు.

పవిత్రతో ప్రేమలత పెనవేసుకున్నాక వారిద్దరి కలయికకి ఒక్కో ద్వారం తెరుచుకుంటూ ఉంటే, అతను నాంచారమ్మకి చెప్పేసాడు “మీరు పూర్తిగా కోలుకున్నారు బామ్మగారూ! ఇంక హాయిగా లేచి తిరగచ్చు” అని.

ఆవిడకి నెప్పి తగ్గిపోయినా డాక్టర్ విశ్రాంతి తీసుకోమన్నాడు కాబట్టి, తనకి ఇంకా తగ్గలేదని, లేస్తే నడుం పూర్తిగా పడిపోతుందని భయపడి, అతను అభయం ఇచ్చిందాకా మంచం మీదే ఉంది. అతను ఇంక లేచి తిరగచ్చు అని చెప్పిన తరవాత ఆవిడకి ఎవరెస్ట్ సునాయాసంగా ఎక్కి దిగినట్టు అనిపించింది. కాళ్ళు, చేతులు సాగదీసుకుని ముందు వర్ధని సాయంతో లేచి కొన్ని అడుగులు వేసి, హమ్మయ్య నడవగలను అనిపించాక హాయిగా తిరగడం మొదలుపెట్టింది.

వివాహం అయి, కాపురానికి వచ్చిన దగ్గర నుంచి అత్తగారిని మంచంలో ఏనాడూ చూడలేదు వర్ధని. కానీ గత నెల రోజులుగా ఆవిడకి అన్నీ మంచం మీదే అమరుస్తూ, వేళకి కమ్మగా వండిపెడుతూ, పాలు, పళ్ళు ఇస్తూ ఉండడంతో ఎన్నడూ లేని తేజస్సు ఆవిడ మొహంలో కనిపించింది. అది చూసి రెండు, మూడుసార్లు అంది కూడా “డాక్టర్లు అలాగే భయపెడుతారు... రోజూ లేచి నాలుగు అడుగులు వేయండి” అని. కానీ, ఆవిడ డాక్టర్ చెప్పిందాకా లేవలేదు.

మాధవశర్మ కూడా తల్లి భయానికి నవ్వుకున్నాడు. ఆవిడ నట్టింట్లో తిరుగుతుంటే అందరూ ఊపిరి పీల్చుకున్నారు. నడవడం మొదలుపెట్టిన నాలుగోరోజు మనవరాలిని రహస్యంగా అడిగింది ఆవిడ" అక్కినేని కొత్త సినిమా ఏమొచ్చింది?" అని.

ప్రేమ మైకంలో పూర్తిగా మునిగిపోయిన పవిత్రకి ఇప్పుడు శివరామక్రిష్ణే అక్కినేని అయ్యాడు. అందుకే నిరాసక్తంగా అంది "ఏమో నానమ్మా! చదువు గోలలో పడి నేను గమనించలేదు".

"మీ నాన్న గదిలో వార్తాపత్రిక ఉంటుంది పట్రా...చూద్దాం" అంది ఆవిడ మనవరాలిని తొందరపెడుతూ.

"దానికోసం వార్తాపత్రిక చూడాలా ఏంటి?రేపు కాలేజి నుంచి వచ్చేటప్పుడు చూస్తాలే" అంది పవిత్ర.

"రేపటిదాకా ఎందుకే ఇవాళ రెండో ఆటకి వెళదాం" అందావిడ.

అప్పుడే అటుగా వచ్చిన వర్ధని చెవిలో ఆ మాట పడడంతో నవ్వుతూ అంది"అప్పుడే నానమ్మ, మనవరాలు సినిమా ప్రోగ్రాం వేస్తున్నారా? ఇంకేం లేదు ఆయనకి తెలిస్తే నన్నుతిడతారు... ఇంకొ నాలుగురోజులు ఆగండి వెళ్ళచ్చు"

"నేనేం అడగలేదు. నాకసలు సినిమా చూసే తీరుబడి కూడా లేదు. బోలెడు హోం వర్క్ ఉంది" అంది పవిత్ర మరో గంటలో శివరామకృష్ణని కలుసుకోబోయే మధుర సన్నివేశం తలచుకుంటూ.

ఆమాటకి నాంచారమ్మ మనవరాలి పట్ల సానుభూతి వ్యక్తం చేస్తూ "అయ్యో అలసిపోకే తల్లీ వెధవ చదువు లేకపోతే పోయింది... హాయిగా మంచి కుర్రాడిని చూసి పెళ్లి చేసేయమంటాను మీ నాన్నని... మొగుడితో రోజూ సినిమాలు, షికార్లు వెళ్ళచ్చు" అంది.

"ఏడిసినట్టు ఉంది. లోకంలో ఆడపిల్లలంతా చదువుకుని, పెద్ద, పెద్ద ఉద్యోగాలు చేస్తూ వృద్ధిలోకి వస్తుంటే, బానే నేర్పిస్తున్నారు మనవరాలికి. సినిమాలకోసం, షికార్ల కోసం అప్పుడే పెళ్లి చేయమంటారా? నాలుగురోజులు ఆగండి నేను తీసుకుని వెళ్తాను" అత్తగారితో అని, కూతురు వైపు చూసి, "వెళ్లి చదువుకో..." అంది.

హాస్పిటల్ లో పేషంట్ల తో బిజీ గా ఉన్న శివ రెండు రోజులుగా ఆమెని కాలేజి దగ్గర పికప్ చేసుకోవడం లేదు. మధ్యాహ్నం అతని వాచ్ మాన్ కాలేజికి వచ్చి చెప్పాడు" డాక్టర్ గారు సాయంత్రం ఆరు గంటలకి తమరిని క్లినిక్ కి రమ్మన్నారు" అని. అప్పటి నుంచీ ఆలోచిస్తూనే ఉంది. కాలేజి నుంచి ఆలస్యంగా వస్తే, ప్రైవేటు క్లాస్ ఉందని చెప్పి తప్పించుకోవచ్చు... కానీ ఒకసారి ఇంటికి వచ్చాక మళ్ళీ బయటకి వెళ్ళాలంటే తగిన కారణం చెప్పాలి. ఆ కారణం ఏం చెప్పాలా అని ఆలోచిస్తూనే ఉంది. ఇప్పుడు మంచి అవకాశం. అందుకే తల్లి మాటలతో ధైర్యం వచ్చి అంది పవిత్ర. "నాగలక్ష్మి దగ్గర నోట్స్ తీసుకోవాలి...వెళ్ళనా?"

"ఇప్పుడా? ఆరవుతోంది. ఈవేళప్పుడు ఎందుకు? అయినా కాలేజి లో తీసుకోవచ్చుగా"

"మర్చిపోయానమ్మా... అంత భయం ఏంటి మన ఊరేగా" విసుగ్గా అంది పవిత్ర.

"అయితే మాత్రం చీకటి పడే వేళకి ఒక్కదానివీ ఎందుకు వెళ్ళడం?"

"నువ్వేగా పెద్ద చదువులు చదివి పెద్ద ఉద్యోగం చేయమన్నావు ఇప్పుడే... ఇలా భయపడితే అవన్నీ ఎలా చేస్తాను?" నిలదీసింది పవిత్ర.

"అదీ పాయింటే. వెళ్ళనీ దాన్ని. పుట్టి పెరిగిన ఊళ్ళో భయం ఏవిటి నీ చాదస్తం నువ్వూను" కోడల్ని మందలించి, మనవరాలికి మద్దతు పలికింది నాంచారమ్మ.

"మా మంచి నానమ్మ" వికసించిన మొహంతో నానమ్మ చెంప మీద ముద్దు పెట్టుకుని, బాణంలా వీధిలోకి పరిగెత్తింది పవిత్ర.

తీయని ఊహలతో వీధి మలుపు తిరుగుతున్న పవిత్ర "పవిత్రా!" అనే పిలుపుకి ఉలిక్కిపడింది. "పవిత్రా ఈ టైంలో ఎక్కడికి వెళ్తున్నావు?"

వీధి చివర రావిచెట్టు మొదట్లో నిలబడి ఉన్నాడు మోహన్. ఒళ్ళు మండిపోయింది పవిత్రకి. విసురుగా అంది "నీకెందుకు?"

ఆ విసురుకి చిన్నబుచ్చుకున్న మొహంతో అన్నాడు" చీకటి పడుతోంది పవిత్రా! అందుకే అడిగాను. పోనీ నేను తోడు రానా?"

"నువ్వా?" చీత్కారంగా చూసింది.

"పెళ్ళికి వెళ్తూ పిల్లిని చంకన పెట్టుకుని వెళ్ళనా? పో నీ తోడు నాకేం అవసరం లేదు" చరచరా ముందుకి నడిచింది.

ఆమె చీత్కారానికి గాయపడిన హృదయంతో అలాగే చూస్తూ నిలబడిన మోహన్, కొన్ని క్షణాల్లో తేరుకుని ఆమె వెళ్ళిన వైపు అడుగులు వేసాడు.

***(కొనసాగింపు వచ్చే నెలలో)***

COMMENTS